

# రాగాలాపనలో రాధ

అంగర కృష్ణమోహనరావు

"ఎమ్మెస్కర్ మదన్! మీరు తప్పకుండా వస్తారుకదూ? రాకపోతే ఊరుకునేది లేదు. మైండిట్" అన్నారాయన తిరిగి.

"ష్యూర్లీ సర్," అన్నాను మరోసారి చేతిలోని సిగరెట్టుని గట్టిగా పిల్చి అంగుళంనుసిని ఏష్‌ట్రేలో దులిపి, పైన మూతగావున్న కుందేలు తలను సరిగా ఉంచుతూ. అది మూడోసారి ఆయన అలా అనటం ఇన్విటేషనుకార్డు యిచ్చిన తరువాత.

"అన్నట్టు మీ మిసెస్‌ను కూడా తీసుకు రావాలి. అండర్‌స్టాండ్?" నోట్లో కొరుకుతున్న పార్కర్‌పెన్ తీసి టేబుల్‌మీద ఉంచుతూ అన్నారాయన.

"సారీ సర్. నే నింకా బేచులర్‌నే" అన్నా, ఆయన వెనుక గోడమీద నున్న కేలండరులోని బొమ్మలో ఈశ్వరుడి ప్రక్కన నైలాన్ చీరకట్టుకుని 'రాక్‌న్‌రోల్' వార్ను డాన్సుచేస్తోంది పార్వతి, లేక ఎవరైనా సినిమాఎక్స్‌ట్రా అయి నానా అని ఆలోచిస్తూ.

ఆయన "ఐసీ" అంటూండగా, టేబులుమీద ఫోను రింగయింది. "థాంక్యూసార్ వస్తా" అని కుర్చీని వెనక్కుతోసి నిలబడ్డా. "ఎస్" అన్నారాయన రిసీవరు ఎత్తుతూ.

నాగది స్వింగుడోర్సు త్రోసుకుని లోపలికి వెడుతూ, మరోసారి చూశా, చేతిలోని కార్డువంక. అది మా డివిజనలు ఇంజనీరు ముప్పయ్యవ జన్మదినోత్సవ ఆహ్వాన పత్రిక. 'చిన్నపిల్లలలా ఇంకా బర్త్‌డే సెలబ్రేషను ఏమిటి?' అనుకుంటూ రొటేటింగుఛేర్‌లో కూర్చుని డ్రాయర్ లాగి, నా పర్సనల్ షెల్ఫ్‌లో కార్డు పడేసి, అంతక్రితమే సూపర్‌వైజరు యిచ్చివెళ్ళిన ఫైలు తెరిచా.

• • •

కార్ను పార్కుచేయబడ్డచోటునా 'ఎంబాసిడర్'ని ఉంచి, ప్రక్కనున్న ప్లిమత్‌లోంచి దిగుతున్న జంటకేసి ఈర్ష్యగా చూస్తూ, ఇంజన్ ఆఫ్ చేశా. బంగళా మెట్లవద్ద కనుపించారు మా డివిజనల్ ఇంజనీరు ప్రభాకరరావుగారు అతిథులకు స్వాగతమిస్తూ.

"హెల్లో మదన్...కమాన్.., కమాన్ ..." అంటూ, ఎదురుగా వచ్చిచేతిని ముందుకు చాపారు. మెల్లిగా షేక్‌హేండ్ ఇస్తూ, గుడీవినింగు అన్నా.

ఆయన ప్రక్కనున్న ఆవిడను చూసేసరికి మా డిపార్టుమెంటు బుల్‌డోజర్లు ఓ అరడజను నా బుర్రలో ప్రవేశించి, నా జ్ఞాపకశక్తిని దున్నసాగినయి.

"రాధా, హిఈజ్ మిస్టర్ మదన్‌మోహన్. మా అసిస్టెంటు ఇంజనీర్. ఈ నెలలోనే వచ్చారు మదన్, మీట్ మిసెస్ రాధాప్రభాకర్ ..." పరిచయం చేశా రాయన.

"నమస్తే" అంది ఆవిడ చేతులు జోడించి.

"నమస్తే" అన్నా, నా తలలోంచి బయటకు పోవడానికి ప్రయత్నిస్తున్న మెదడును 'క్రేన్స్'తో వెనక్కి లాగుతూ.

నే తెచ్చిన అమెరికన్ 'టేబిల్‌లైట్'ని ఆయన చేతిలో వుంచి, "మెనీ హేపీ రిటరన్స్ ఆఫ్ ది డే" అని గ్రీట్ చేశా.

"థాంక్యూ" అని "రాధా! ఈయన్ను గెస్ట్సు దగ్గరకు లీడ్‌చేయి" అన్నారు.

అప్పటికే నా మతి సగం దేవలోకానికి వెళ్ళింది. దీంతో ఉన్నది కాస్తా పోయింది. ఆమె ముఖం మీద నా కేదో పరిచయమయిన ముఖం సూపర్ ఇంపోజు అయి కనుపించసాగింది. కొంపదీసి ఈవిడ ఆ రాధాదేవి కాదుకదా? ఆ రాధను చూసి ఎన్నాళ్ళయింది? మళ్ళీ ఇన్ని సంవత్సరాలకు సికింద్రాబాదులో పట్టుబడ్డా నన్నమాట అనుకొంటూండగా "రండి" అని వినిపించింది.

పిచ్చివాడిగా అలా నిలబడటం సభ్యతగా వుండదని ఆమెవెంటనే నడిచా. నా దురదృష్టాన్ని తిట్టుకోడానికి ఏ భాషలో ఎక్కువ మాటలు ఉన్నాయా అని ఆలోచిస్తూ ఒకమూల ఖాళీగావున్న టేబులు దగ్గరకు దారితీసింది.

"కూర్చో మదన్! నేను జ్ఞాపకం వచ్చేనా?" అంది ఆనందంగా నవ్వుతూ.

అదే నవ్వు, ఆ కళ్ళల్లో అదే మెరుపు— నవ్వినప్పుడు సొట్టలు పడే బుగ్గలు, ఆ రాధవే. అని చెప్తూంది నా మనస్సు నా చుట్టూ గోలగా తిరుగుతూ.

"మీరు ... మీరు ... రాజమండ్రి రాధాదేవి ..." ఏదో అనబోయా, ఆలోచనా ప్రవాహానికి నిజాంసాగర్‌కన్నా గట్టిడాంకట్టి, ఏర్పడిన టాంక్‌లో మాటలకోసం గాలిస్తూ.

"అవును మదన్! నన్ను రాజమండ్రిలోనే మర్చిపోయావా? ఇన్నేళ్ళనుండీ ఏమయిపోయావు మదన్?" తిరిగి చిన్నగా నవ్వింది. ఆ నవ్వే తనను ఓనాడు రాధాదేవికి అంత సన్నిహితుణ్ణిచేసి, దూరంగా తరిమేసింది.

"రాధా... ఎన్నాళ్లకు కలుసుకున్నాం రాధా.! నువ్వవునో కాదో అని ఇప్పటిదాకా నా జ్ఞాపకశక్తితోయుద్ధంచేస్తున్నా. ఎంతమారిపోయావ్" అంటూండగా పరిస్థితి మర్చిపోయి భూతకాలం గుండా ఆమె చేతిని తాకడాన్కిముందుకు పోతున్న నా కుడిచేతినిఅదుపులోకి తెచ్చుకోడాన్కి బ్రహ్మం డమ్మైంది.

"నువ్వు బి. ఈ. చదివావన్నమాట. గుడ్. మరోలాఅయితే మనం మళ్ళా కలుసుకునేవాళ్ళమే కాదేమో. ఇంతకు ముందెక్కడ పనిచేశావ్? ఈ మాటలు కేవలం సంభాషణ పొడిగించడానికే అని నాకు తెలుసు.

"బెజవాడలో" అన్నా సిగరెట్ వెలిగిస్తూ.

"పెళ్ళయిందా?" అన్నది తిరిగి మునుపటిలా నవ్వుతూ.

"ఉహూ. ఇంకా అంతభాగ్యం పట్టలా, అయినా అదేమంత ముఖ్యం అనిపించలేదు కూడా. గట్టిగా దమ్ములాగి వదులుతూ, గాలిలో హెలెన్ కన్నా బాగా రాకెన్‌రోలుతూన్న పొగగుండా ఆమెను చూస్తూ అన్నా నిర్లక్ష్యంగా.

"ఓ! ఆడవాళ్ళమీద అలిగావా?" చిరునవ్వు నవ్వింది.

ఇంతలో ఆమెను వెతుక్కుంటూ అటే వచ్చేరు ప్రభాకరరావుగారు. "వాట్ రాధా! నువ్విక్కడే కూర్చుండి పోయావ్! మోహనరావుగారా! మా రాధకు కబుర్లుంటే తిండికూడా అక్కరలేదండీ"అన్నారాయన బిగ్గరగా నవ్వుతూ.

నేలమీద పాకుతున్న చీమల్ని లెక్కపెడుతూ ఉండిపోయా.

"అది కాదండీ. ఈయన మ రెవరో కాదండీ! నే నప్పుడప్పుడూ చెప్తూవుంటానే "మా మదన్ బ్రదర్" అని ఆయనేనండీ" అంది లౌడ్‌స్పీకరులా దడదడమంటూ. ఆ మాటలు మా వర్కుషాపులోనిమెషీన్లమోతఅంత శ్రావ్యంగాఉన్నాయి.

"ఐసీ. మనం మరీ దగ్గరవుతున్నా మన్నమాట, మదన్. అయితే రాధా ఆఖరికి మీ అన్నయ్యని కల్పుకొన్నావన్నమాట ... "

"కాదండీ తమ్ముడే" అంది నవ్వుతూ.

"ఓ సారీ! నీ కన్నా చిన్నవాడన్నావుగా! ఇంట్లో మీరు కాలేజీ సెక్రటరీ చేసిన ఇయర్ ఫోటో వుంది. పోలికలు అలాగేవున్నా, మీ రవునో కాదో అనుకుంటున్నా. దాన్లో మిమ్మల్ని చూపించి తెగ పొగుడుతూంటూంది. కాలేజీలోచాలా హుషారుగా వుండేవారటగా. అన్నట్లు మీరు టెన్నిస్ ఛాంపియనటకదా! మీతో గేం ఎంతసేపు ఆడగలనో చూడాలి ..." ఆయనేదో చెప్పుకుపోతున్నారు. ఈ సంభాషణంతా నాకు బ్రహ్మాండమయిన తుఫానులో డాబామీద అండర్ వేర్సుతో నిలబడమంత ఆనందంగా వుంది.

"ఓ మర్చేపోయ్యా. అవన్నీ తీరిగ్గా మాట్లాడుకొందాం. ఎక్స్యూజుమీ. అవతల చాలామంది వున్నారుగా. " ఎంత హడివుడిగా వచ్చారో అంత ఇదిగా వెళ్ళిపోయా రాయన.

"మదన్ నువ్వు మధ్యలో పారిపోకేం, ఆఖరున నాతో చాలా మాట్లాడాలి. చివరివరకూఉండు." అంటూ ముందుకు నడిచింది రాధ.

"'బతుకు మదనా' అని ఓ శ్వాస వదిలి, టేబుల్ మీదున్న ఆరెంజి బాటిలులోంచి స్ట్రా తీసి అవతలపారేసి, సభ్యతకూడా మరచి బాటిల్ ఎత్తిగబగబా తాగేసా. అప్పుడుజ్ఞాపకం వచ్చింది. చుట్టుప్రక్కల వాళ్లెవరైనా చూశారేమోనని. అదృష్టవశాత్తూ ఎవరూ చూడలేదా ఫీట్. కర్చిప్ మొహంమీంచికురుస్తున్న చెమట వర్షాన్నితుడిచేశా.

* * *

ఎంటర్టయిన్‌మెంట్ ప్రోగ్రామ్సు జోరుగా సాగిపోతున్నాయి. "అతిధులకోర్కెలపై ఇప్పుడు శ్రీమతి రాధాప్రభాకర్ గారు ఓ పాట పాడుతారు" మైక్‌లోంచి వినిపించింది ఎనవున్సుమెంటు. సిగరెట్ వెలిగిస్తూండగా.

"ఆజారే ... ఏ .... ఏ... ఏ... పరుదేశీ
మైతో కబుసే ఖడే ఇసుపార్ ... .........

నా నోట్లో సిగరెట్ జైవిూంచి క్రిందికి దొర్లి—నేలమీద పడింది. ఎనిమిది సంవత్సరాల క్రితపు 'మధుమతి' లోని పాట అది. ఒకనాడు సినీ ప్రేక్షకులను ఉర్రూతలూగించిన పాట. ఆహాటే — ఆహాటే — ఒకనాడు నా పరువును (పబ్లిక్ బజార్లో కాకపోయినా, ప్రవేటుగా) నిలువునా ఖూనీ చేసిన పాట. ఆనాటి ఈ పాటకితిరిగి ఆమె నోటివెంట ఎవరిని ఉద్దేశించి వినబడుతూందో చెప్పనవసరం లేదు.

ఆపాట, ఆపాటలోనే నొకనాడు ఆనందించిన 'మెలొడీ' ఇప్పుడు నాకు వినిపించటం లేదు. ఇంతకుముందు బెజవాడలో ఉండే మా డివిజనలు ఇంజనీర్ కంఠంకన్నా కర్కశంగా వినిపించసాగింది. చెవులు మూసుకుందా మనుకున్నాను కానీ, బాదేమిటో తెలిని చుట్టుప్రక్కలవాళ్లు చూస్తే మర్యాదగా వుండదని ఫూరుకున్నా. ఆ తరువాత జరిగిందేమిటో తెలీదు. నా శరీరం మాత్రం అక్కడవున్నా, మనస్సు హెచ్. జి. వెల్స్ టైంమెషీన్‌లో కొన్నిసంవత్సరాలు వెనక్కువెళ్ళిపోయింది. ఎనిమిది సంవత్సరాలక్రితం జరిగిన విషయాలు మొట్టమొదట నా మొఖంమీద సూపర్ ఇంపోజు అయి నెమ్మదిగా ఫ్లాష్‌బాక్‌లో కనిపించసాగినయి.

• • •

నేను ఇంటర్‌మీడియేట్ చదివే రోజులు — అది జూలై నెల. కాలేజీలో ఎలక్షన్ కొట్లాటలు ముమ్మరంగా సాగుతున్నాయి. కాలేజి ఎక్జిక్యూటివ్' ఎలక్షన్సుకు నామినేషన్లు పడేయటానికి ఆ మరునాడే ఆఖరు రోజు. ఆరోజు సాయంత్రం గోదావరి గట్టున రెయిలింగు మీద కూర్చుని ఉండగా కోదండపాణికో దుర్బుద్ధి పుట్టింది. "ఒరేయ్ మదన్ కాలేజి యూనియన్ సెక్రటరీషిప్‌కి నువ్వు ఎందుకు పోటీ చేయకూడదురా?" అన్నాడు.

"మహారాజులా చేయొచ్చు ఓట్లు వేసే[illegible]నుభావులంటూ ఉంటే" అన్నాను నేను.

"ఎలక్షను వరకూ ముక్కూమొహం ఎవరో తెలీని ప్రతివాడూకూడా తయారవుతుంటేనేం రా",అన్నాడు గోపాల్ నెత్తిమీదున్న వెంట్రుకల గోపురాన్ని సరిచేసుకొంటూ.

"ఇంటర్ కాలేజియేట్ టెన్నిస్ ఛాంపియన్

వి,జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌వి,నీకన్న పాపులారిటీ ఇంకెవరికుంటుందిరా ఎందుకు నెగ్గవో చూస్తాం నువ్వు నామినేషన్ పడేయ్—"ఇది వెంకట్రామయ్య సలహా.

నాకు నవ్వువచ్చింది. నవ్వా.రోడ్డు మీదరిక్షాలోపోతున్న అమ్మాయి అదిరిపడేలా నవ్వా.

"ఏం" అన్నాడు బాలగోపాల్ అమాయకంగా.

"ఒరేయ్ నాకెవరురా ఓట్లు వేసేది. మన అరడజను ఓట్లూ దాటిపైన ఒక్కటి కూడా రాదు" అన్నా.

"ఒరేయ్. ఛాలంజిరా. నువ్వేగానీ గెలవకపోతే నేను ఈటకప్, ఈస్టయిలూ మానేసి జీవితమంతా పైజమాన్‌తోనే గడుపుతా." ఇది కోదండపాణి భీకరమైన ప్రతిజ్ఞ.

"ఎంత డబ్బు ఖర్చయినాసరే,నేపెట్టుకొంటా మన గ్రూప్‌లోంచి ఒకడు ఈ సంవత్సరం కాలేజి సెక్రటరీ అయితీరాలి. అందుకు నీకన్నా కాలేజీలో 'వెల్‌నోన్'అయినవాడూ, నోట్లో సరయినవి ఒకనాలుగు కాకపోయినా రెండయినా ఇంగ్లీషుముక్కలున్నవాడూ, మనలో ఇంకెవరూ లేరు. మావాళ్ళ ఓట్లన్నీనీకే పడేలా చూస్తా. ఇక డబ్బు గురించి బెంగ అసలే అవసరం లేదు," అన్నాడు వెంకటరత్నం—ఆవేసంగిలోనే అత్తవారి నుండి లక్షరూపాయిల కట్నం ఒడేసి ... వారిబిడ్డ.అక్కడను 'ఆ అప్పివెలఖర్చూ' నేను భరించలేనట్లు.

ఇవన్నీ వింటుంటే నాబుర్రలో ఆగస్ట్ నెల గోదావరి ప్రవహించసాగింది.హోరున రొదచేస్తూ. ఆరాత్రే కాకినాడ డీసెల్ ఎక్స్ప్రెస్ వాళ్ళ గోల తప్పించుకోడాన్కి. మూడు రోజులు పోయిన తర్వాత తిరిగివచ్చి కాలేజీకి బయలుదేరా. నోటీస్ బోర్డులోని కాంపిటేటర్సు లిస్ట్‌లో నాపేరు ఉండటం, అంతకు ముందు యూనియన్‌కి కంటెస్ట్ చేస్తున్న ఇద్దరిలోఒకరిపేరు మాయం కావటం చూసే సరికి నామెదడులో రాకెట్లు ఢీకొన్నాయి.

"ఇంకానయం మావరువు పూడేది. ఇవాళ రూపా తగులడ్డావ్.సాయంత్రమే ఏలక్ష్యాషన్' ఉంది ...."అంటూ నానాచీవాట్లూ వేసేడు కోదండపాణి.

స్టేజిమీద రాజకీయ నాయకులకన్నా బాగా అరవగలనని ఆరోజే మొదటి సారి తెలుసుకొన్నా. స్టేజీ ఎక్కగానే వణుకుతాయను కొన్నకాళ్ళు అందుకు విరుద్ధంగా స్టయిల్‌గా వూగినయిట. అంటె నేను స్టేజీమీద తాపిగా వాగగలనన్నమాట అనుకొన్నా. ఎలక్ష్యాషన్ లోనా వాగ్దాటిని పాస్ చేసేరు.

ఆవేళ సాయంత్రం నుండే బ్రహ్మాండమైన పబ్లిసిటీ మొదలు పెట్టేరు మామిత్రబృందం. పేంప్లెట్స్‌లో ఉన్నవీ లేనివీ కల్పించి ప్రింటు చేయించి వీలైనంత ఎక్కువ మందిని కాఫీహోటల్స్‌లో మేపీ, సినిమాలు చూపించీ,వాళ్ళద్వారా కేన్వాసింగు మొదలు పెట్టేం.

"ఎక్స్—లేడీస్ యూనియన్ సెక్రటరీ రాధాదేవితో నాకు టచ్ ఉంది. ఆమె మన తరపున పని చేస్తుందేమో కనుక్కొందాం.", అన్నాడు కోదండపాణి ఒకరోజున. ఆవేళసాయంత్రమే ట్రిమ్‌గా మేకప్ అయి రాధాదేవి ఇంటికి బయలు దేరేం.

'నాకెన్నిస్ ఆట అంటే ఆమెకు చాలాఇష్టమనీ, నావేపు పని చేయడాన్కి తాను సిద్ధమేననీ' ఆమెనన్ను పొగుడుతూంటే కూర్చున్న సోఫాలో ఒక్కసారిఎగరాలనిపించింది. వెంకటరత్నం సప్లయి చేసిన 'లాండ్ మాస్టర్'లో మరునాటి నుండే కొందరు లేడీ స్టూడెంట్స్ ఇళ్ళకి బయలు దేరేం రాధాదేవీ,నేనూ కేన్వాసింగ్ కోసం.

ఈ ఎలక్షను గురించి తిరగటంలో ఆమెతో అత్యంత సన్నిహిత్యం ఏర్పడింది నాకు. మరునాడు ఎలక్షను తేదీ అవటంవల్ల, పంచి పెట్ట వలసిన సెంటుకార్డ్స్ ఆమెకివ్వడాన్కి ఆమె ఇంటికి బయలు దేరేను, ఆరోజు సాయంత్రం గుమ్మం లోఉండగా, ఒక కంఠం సన్నగా అత్యంతశ్రావ్యంగా వినిపించసాగింది.లోపలినుండి "ఆజారే ఏ......ఏ......ఏ.....పరదేశీ........." అది సాయంత్రం 6 గంటలసమయం అంటే రేడియోసిలోన్ నుంచి వస్తూన్న పాట కాదు. వాళ్ళ ఇంట్లో ఏరికార్డు కాదనీ, నోటితో పాడుతూన్న పాటేననీ తెల్సి పోయిందిమ్యూజిక్ లేకపోవటంవల్ల.ఎవరా అని గుమ్మంలోనే ఆగిలోపలికి చూశా. సోఫాలో వయ్యారంగా పడుకొని పాడుతోంది. రాధాదేవి 'మధుమతి' పుస్తకం చేతిలో పెట్టుకొని.ఆపాట వింటుంటే నామనస్సునైనితాల్' కొండల్లోకి ఎగిరిపోయింది వైజయంతి మాలతో విహరించడాన్కి. పాట అయిపోయిందని నేతెల్సుకొనేలోపలే, రాధాదేవేనన్ను చూసింది.

"హల్లో మిస్టర్ మదన్‌కమార్", అంటూ లేచివచ్చింది పైట సర్దుకొంటూ.

"అబ్బ నిజంగా ఈపాట లతామంగేష్కర్‌కు బదులు మీనోటి మీదుగా రికార్డయి ఉంటే ఎన్నివేల రికార్డులు అదనంగా అమ్ముడయి ఉండేవో "అన్నా నవ్వుతూ.

"షేమ్ చేయకండి. లతాయొక్క మాధుర్యం నాకంఠంలో ఎక్కడనుండి వస్తుంది ? ఇప్పుడే పోస్ట్‌లో మధుమతి పుస్తకంవస్తే రేడియోలో విన్నదాన్ని బట్టి ప్రయత్నిస్తున్నా." చిరునవ్వునవ్వింది.

'ఉహూ అలాకాదు.మ్యూజిక్ ఉంటే మీ పాటే లతాకన్న ఎంతో బావుండేది.మీరేమీ అనుకోకపోతే ఆపాట మరొక్కసారి.. ." అన్నా. ఆమె నదిలోని ఫోమ్ సోఫాలో కూర్చుంటూ.

"మరి మీరలా పొగుడుతూ నన్ను ఇన్‌సల్ట్ చేయకుండా ఉంటే." అందిమరో కుర్చీలో కూర్చుంటూ రాధ. . . . . . . .

• • •

ఎలక్షన్‌అయిపోయింది. కోదండపాణి'టక్' చేసేరోజులు ఇంకా మిగిలి ఉండటం చేతనైతే నేమి నావరువు కాలేజీలో నిలబడే యోగ్యతఉండటంవల్లనైతేనేమి—మొత్తంమీద నేను కాలేజీ సెక్రటరీగా ఎలక్టయ్యా.

ఆవారంలోనే'ఫ్రెషర్స్‌డే' ఏర్పాటయింది. మీటింగు అయింతర్వాత వినోద కార్యక్రమాలు జరుగుతున్నాయి. 'స్టూడెంట్స్ మ్యూజిక్ పార్టీ' జరుగుతూండగా నేను స్టేజీ మీదకు వచ్చిమైక్‌లో చిన్న ఎనవున్స్‌మెంట్ చేశా—"ఇన్నాళ్ళనుండీ మన కాలేజీ ఒక గొప్ప మ్యూజిక్ ఆర్టిస్ట్‌ని గుర్తించలేక పోయింది. ఆమె మరెవరో కాదు. మన కాలేజీ లేడీస్ యూనియన్ ఎక్స్ సెక్రటరీ మిస్ రాధాదేవి ఆఫ్‌ఫోర్త్ ఓ. ఎస్సి. ఆమె ఆజారే.... పరదేశీ... పాటపాడుతారు. లతా కంఠం బావుందో. రాధాదేవి కంఠం బావుంటుందోమీరే తేల్చాలి. మిస్ రాధాదేవిని స్టేజీ మీదికి రమ్మని స్టూడెంట్స్ తరపున కోరుతున్నా."

ఇక తప్పదని ఆడియన్స్‌లోంచి స్టేజిమీదికి వచ్చింది రాధాదేవి. అప్పటి వరకూ ఆమె వెనుక మ్రోగిన ఈలలూ, మెరుగుళ్ళు తాలూకు చప్పుళ్ళూ—ఆమెకంఠం వినిపించగానే—చప్పగా చల్లారిపోయింది చలికాలంనాటి రాత్రిలా.

• • •

మరునాడు ఆమె ఇంటికివెళ్ళా. హృదయపూర్వకంగా స్వాగతమిచ్చిందామె. "నిన్న మీపర్మిషన్ తీసుకోకుండానే మిమ్మల్ని స్టేజీమీదికి రప్పించినందుకు క్షమిస్తారని ఆశిస్తున్నా" అన్నా.

"దానికేంలెండి. అయినా మీరుచేసిన పని ఏం బావుండలా. అందరిముందు పాడటం ఇష్టం లేకే బయటపడలేదిన్నాళ్ళూ"

"ఓహో. సారీ. మీకంఠం మాధుర్యం కాలేజీ అంతా మార్మోగాలనే అలాచేశా, మీటేలెంట్ వృథాపోవడం ఇష్టంలేక, మీలాంటి చక్కటి ఆర్టిస్టులు అజ్ఞాతంగా ఉండిపోవడం మాత్రం బావుందంటారా ?"

"ఉండండి ఇప్పుడేవస్తా" అని లోనికిపోయి కాఫీ ట్రేతో తిరిగి వచ్చింది.

కాఫీసిప్‌చేస్తూ "మీరేమీ అనుకోపోతే ఆపాట మరొక్కసారి. ఏమిటో అసలే ఇష్టమైన ఆపాట, మీకంఠంలోంచి వింటూంటే ఇంకా ఇంకా వినాలనే అనిపిస్తోందండీ" అన్నా కాఫీ కప్పుమీదుగా ఆమెకళ్ళచివరనున్న కాటుకను చూస్తూ.

• • •

ఆ సంవత్సరం పూర్తయ్యేలోపువన వేనెన్నిసార్లు ఆమె ఇంటికివెళ్ళేనో, ఎన్నిసార్లు ఆమె కంఠమాధుర్యాన్ని ఆనందించానో నాకేతెలీదు. ఆ సంవత్సరం 'ఇంటర్ కాలేజి యూత్‌ఫెస్టివల్ రికమండ్ చేయించా మాకాలేజ తరపున 'బెస్ట్ సింగర్' గా సెలక్టయింది.

వేసవి సెలవుల్లో కూడా ఆమెనువదిలి మా ఇంటికి పోబుద్ధి వేయలేదు. ఈ ఎనిమిది నెలలలోనూ ఆమె నన్ను 'మదన్' అనిపించటం, నేనామెను 'రాధ' అనటం తప్ప ఆవరిధి దాటలేదు మాస్నేహం. అందుకు కారణం నా అశక్తతేనేమో ననిపించేది. నాహృదయం



శ్రీరంగపట్నంలో ఒక దృశ్యం  యలమర్తి గోపాలకృష్ణారావు

లో ఆమె అంటే నాకుగల ప్రేమను వ్యక్తం చేయుడం ఎలాగో నేర్చుకోడాన్కి ఒక డైరెక్టర్ పెట్టుకుందామని ఎన్నోసార్లు అనుకొనేవాణ్ణి. ఈ ఎనిమిది నెలలలోనూ నేతెల్సుకొన్న బిజినెస్ ఏమంటే—ఆమె తండ్రి ఒక పెద్దసంస్కారి ఫరమ్‌లో మేనేజరు. ఉన్నతభావాలుగల వాడుఇక తల్లి జబ్బుమనిషి. మేడ దిగిరాదు. నేను రోజూ వచ్చిపోవటాన్కి ఆ ఇంటిలో ఏలాటి అభ్యంతరమూ లేకపోయింది.

ఆ రోజుసాయంత్రం మామూలుగా ఆమె ఇంటికి బయల్దేరా. రూంలోకూర్చో గానే ఆమె "మదన్! ఇవాళ నాపుట్టినరోజు. ఎవరికీ చేయకపోయినా నీకొక్కడికే చిన్నపార్టీ" అంటూ ఒక డజను రకాల పదార్థాలుగల ప్లేటుని నాముందుంచింది. అవన్నీ తినటాన్కి, 'ఎస్. వి. రంగారావు', వసంతరావ్ పహిల్వాన్'ల వేషాలు వేసే ఫుటోల్కి ఉడుకూడా లాభంలేదు. మొత్తం మీద ఆమెను ఒప్పించి ఇష్టంగా తినేసా.

"చాలారోజులయింది 'ఆజారే' పాట విని. నాబర్త్‌డేరోజున ఇప్పుడు నువ్వుతప్ప స్వీట్స్ తాలూకు తీపికలిపి—మరింత మధురంగా వినాలని ఉంది." అన్నా.

పాటవింటున్నతసేపూ ఆమెవంకే చూస్తూ ఉండిపోయా. ఆరోజు ఆమె మామూలు రాధలా కనుపించలేదు నాకు. లైట్ రెడ్‌కలర్ నైలాన్ చీరలోంచి మెరుస్తూ, ఎంతరంగునూ మెరుపుల్ని తూస్తున్న గ్రీన్‌కలర్ శాటిను లంగా, దానిక్రింద నుండి మెరిసేసున్నని వంపులు తిరిగిన పిక్కలూ, పైటపైనుండి కన్పిస్తూన్న గ్రీన్‌కలర్ నైలాన్ జాకెట్‌లోంచి తొంగిచూస్తున్న వక్షోజాలూ, నాశరీరాన్ని ఎక్కడెక్కడికో తేల్చివేయ సాగినయి. నేను కూర్చున్న సోఫాలో నుండి. పాడటాన్కి ఆమెతీసే ఊపిరితో, ఏమాత్రం లూజ్‌గావున్నా, జారిపోతానేమోనని ఆమెశరీరాన్ని గట్టిగా అంటిపెట్టుకుని ఉన్న, జాకెట్ కుట్లు పిగిలిపోతాయేమోననిపించింది అబిగుతుకి.

"ఆజారే—అని రమ్మని ఆహ్వానిస్తోంది రాధ" నేనుఅక్షణంలో ఆ రాధకు కృష్ణుడినయిపోయా. ఆమె రాధిక. నేను కృష్ణుడు. పాటపూర్తయింది. కృష్ణుడి ఆవేశం కట్టలు తెగింది. రెండుచేతులూ రాధ శరీరాన్ని పెనవేశాయి. కృష్ణుడి పెదిమల తాకిడికి ఆగలేక రాధపెదిమలు వణికిపోయాయి" అంతే కుర్చీలో వెల్లకిలా పడటంతో కోడుతలకు కొట్టుకుంటంతో నేను తిరిగి 'మదన్' గా మారి పోయా కృష్ణుడిలోంచి."

ఎదురుగా రాధ నిలబడిఉంది నాసెల్ఫ్[illegible] కళ్ళు ఎక్కువగా వణికిపోతూ. నాపెదిమలు ఆమె పెదిమలను తాకినచోట ఆమె అరచేతులు తుడిచి వేస్తున్నాయి. "ఎంతపొరపాటు చేశావు మదన్. నువ్వు ఇలాంటి పాడుపని చేస్తావనుకోలేదు. నీ లోపల ఇలాంటి కోరిక దాగి ఉందని తెలిస్తే ఈ గుమ్మంలో అడుగు పెట్టనిచ్చే దాన్నేకాదు. అయినా నేను నీకన్నా వయసులో రెండు సంవత్సరాలయినా పెద్దదాన్ని. నాకు కూడా తెల్సు. నేను ఇన్నాళ్ళనుండి నిన్ను ఒక తమ్ముడిగా చూసేను. నాకు తమ్ముడులేని లోటు తీర్చావనుకొన్నా. కానీ. . కానీ. వెధవపని చేస్తావనుకోలేదు మదన్." అంది కళ్ళుతుడుచుకొంటూ.

ఆ సమయంలో నాశరీరాన్నుండి కారినచెమట ఆనకట్టు కడితే రామపాదసాగర్ కన్న పెద్ద టాంకు తయారయి ఉండేదని... తలవంచుకొని కూర్చున్నా.

"ఈ సంఘటన జరగలేదనుకో మదన్. నేను అప్పుడూ తమ్ముడిగానే చూసేను నిన్ను, ఇప్పుడూ తమ్ముడిగానే చూస్తున్నా. నువ్వు నాతమ్ముడి గానే తిరిగి ఈ ఇంటికి రావచ్చును. మామూలుగా" అనేసి గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది. చాలు. కొట్టకర్లా తిట్టకర్లా. హృదయా, నికి నాటేగా గుచ్చుకోడాన్కి ఆమాటలు చాలు.

అంతే ఆమర్నాడే మూటాముల్లే కాకపోయినా పుస్తకాలూ, బట్టలూ ఆపేసి—సర్దేసి కొంతకి ప్రయాణం కట్టేశా. ఆ తర్వాత నాలుగుసంవత్సరాలూ వైజాగ్‌లో ఇంజనీరింగ్ చదవటం, మరో మూడేళ్ళు అక్కడా అక్కడా జూనియర్ ఇంజనీయర్‌గా పనిచేయటంతో గడిచిపోయింది. మళ్ళీ రాజమండ్రి మొఖం, రాధదేవి మొఖం చూడకుండానే. ఇప్పుడు అసిస్టెంట్ ఇంజనీయర్‌గా హైదరాబాద్‌కి ప్రమోటయ్యి ననుకొనేసరికి, ఆ ఆనందం పూర్తిగా అనుభవించ కుండానే కత్తులబోనులో ఇరుక్కున్నా.

* * *

"మిస్టర్ మదన్! ఇదేమిటి ఇలా ఉండి పోయేరు" ఎవరో కుదుపుతున్నారు.

కళ్ళు తెరిచానుకొన్నా. కానీ తెరవలేదని తెల్సింది. , కారణం అవితెరిచే ఉన్నాయి. ఎదురుగా రాధాదేవి, ఆమె భర్త మా ఇంజనీయర్ ప్రభాకరరావుగారూ కన్పిస్తున్నారు. అంటే నేను కళ్ళుతెరిచే చుట్టూ జరిగేదేదీ చూడలేదన్నమాట. అప్పటి కెంత సేపటి క్రితమో అతిథులు వెళ్ళిపోయారు. బోసిగా ఉన్న టేబిల్స్, స్టేజీ రమణారెడ్డి జోక్‌లా పకపకా నవ్వుతున్నాయి నన్ను చూసి.

"అబ్బే ఏంలేదండీ ఏదో ఆలోచిస్తూ ఉండి పోయా. అంతే," అన్నా కుర్చీలోంచి లేచి.

'ఎంబాసిడర్' వరకూ వచ్చి సాగనంపేరు వాళ్ళిద్దరూ. "మదన్ రేపుసాయంత్రం ఆఫీస్ నుండి వెళ్ళేప్పుడు ఆయన కూడా ఇక్కడికి వచ్చేయి. టీ తీసుకుందువుగాని. నీతో చాలా మాట్లాడాలి..." ఏదో అంటూంది. ఆమాటలు నాకు వినిపించుకుండగానే, స్టార్టర్ నొక్కి బ్రేక్‌వదుల్తా గేర్‌లీవర్‌ని కాలితో గట్టిగా అదిమి సెకండ్‌గేర్‌లోనేశా. ఎగ్జాస్ట్ చేసిన బరబరల్లో ఆమె మాటలు కల్సిపోయాయి. స్పీడోమీటర్ 40 దాటుతుండగా బ్రేక్‌వదిలేసా. డోర్‌ని పట్టుకొన్న రాధను ప్రక్కకు తూలేలా త్రోసి. స్పీడందుకొంది నా ఎంబాసిడర్, క్లయిమాక్స్‌లోని హీరో మనస్సులా.

హెడ్‌లైట్ల వెలుతురులో తళతళ మెరుస్తూన్న బొలారమ్ తారురోడ్డు సంతోషంగా వెళ్ళిపోతుంటే నాకారు క్రిందికి భయం భయంగా పరిగెత్తుకు వచ్చి దాక్కోవడం నాకళ్ళు చూస్తున్నాయి. మనసు మాత్రం వచ్చేనెల మెడికల్ లీవ్‌కి హైదరాబాద్‌నుండి ట్రాన్స్‌ఫరు వస్తుందా అని ఆలోచిస్తోంది.